# సహజ జ్ఞానము - రాజయోగముల ఆధ్యాత్మిక చిత్రప్రదర్శిని




## ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయము

# నేను ఎవరు ?




మనస్సు-బుద్ధి సహితంగా వున్న
నేను చైతన్య ఆత్మను,
పరంధామ నివాసిని మరియు
పరమాత్మ సంతానాన్ని
శరీరము నా రథము, నేను
శరీరాన్ని కాదు, పరమాత్మను కాదు.

మానవుడు తన నిత్య జీవితములో ఎదురయ్యే ఎన్నో సమస్యలను పరిష్కరించుకొనవచ్చు. కాని "నేను ఎవరు" అన్న చిన్న ప్రశ్నకు మాత్రము సరియైన సమాధానము తెలుసుకొనలేకపోతున్నాడు. ఎవరైనా "నీవు ఎవరు" అని ప్రశ్నిస్తే, నేను ఫలానా రామచంద్రాన్ని, మురళికృష్ణని, శంకర్‌ని అనే సమాధానము లభిస్తుంది. కాని నిజానికి ఈ పేర్లు అన్నీ శరీరమునకు సంబంధించినవి. "నేను" అనేది ఆత్మకు, "నాది" అనేది శరీరమునకు వర్తిస్తుందనే యదార్థ జ్ఞానము లేనందువలన ఈనాడు మానవులంతా దేహాభిమానులై అశాంతి, దుఃఖములతో బాధింపబడుచున్నారు. కావున ఇపుడు పరమాత్మ శివుడు మనందరకూ ఆత్మయొక్క స్వస్వరూప జ్ఞానమును బోధిస్తున్నారు. దీని వలన మనమెవరము? ఎచటి నుండి వచ్చాము? ఆత్మిక సుఖశాంతులను ఎలా పోగొట్టుకున్నాము? మొదలగు నిగూఢమైన ప్రశ్నలకు సమాధానము లభిస్తుంది. జీవితపు చిక్కు సమస్యలన్నిటినీ తీర్చుకొనగల్గుటయే కాక ఆత్మిక జాగృతిచెంది మానవుడు మాధవునిగా నారి శ్రీమహాలక్ష్మిగా విరాజిల్లుతారు. ఇపుడు ఆత్మయొక్క సత్య పరిచయము ద్వారా పరమాత్ముడు మనకు ముక్తి, జీవన్ముక్తి, సంపూర్ణ సుఖశాంతి పవిత్రతలకర్హులుగా తయారు చేయుచున్నారు.

# ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయము

## పరిచయము

ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయము 1937వ సంవత్సరములో స్థాపించబడినది. ప్రపంచములో దిగజారుచున్న నైతిక ప్రమాణములను ఉద్ధరించి, మూఢాచారములను, అంధ-విశ్వాసములను తొలగించి, సత్య జ్ఞానయోగముల ద్వారా మానవులను దివ్యగుణాలతో తీర్చిదిద్ది భారతదేశము మరియు ప్రపంచమును ఉద్ధరించుట ఈ సంస్థ యొక్క ప్రధాన లక్ష్యము. జాతి, మత, కుల, వర్గ, వర్ణ, లింగ, వయో బేధములు లేకుండా సర్వ మానవులు నిరాకారుడైన పరమపిత పరమాత్ముని సంతానము కావున విశ్వ మానవులందరూ పరస్పరం సోదరులమని భావిస్తారు. సృష్టి ఆరంభంలో మానవుడు పవిత్రాత్మగా, దివ్యగుణ సంశోభితుడుగా, సర్వసుఖ సంపన్నుడుగా ఉండేవాడు. కాలక్రమములో ఆత్మికశక్తి లోపించుట చేత దివ్య గుణాలను కోల్పోయి సర్వసుఖ సంపన్నతలకు దూరమవుతాడు. అనేక మత, కుల, వర్గ భేదములచే ఈనాటి మానవ సమాజము పూర్తిగా పతనమైనది. మరల ఇపుడు సనాతనమైన సహజ రాజయోగము, సత్యగీతా జ్ఞానము ద్వారా మానవ సమాజము పూర్వస్థితిని పొందగలదు. ఇది ఒక వినూత్నమైన ఆధ్యాత్మిక క్రాంతి.

ఆధ్యాత్మిక రంగములోని భ్రాంతులను తొలగించి జ్ఞాన క్రాంతి ద్వారా విశ్వకళ్యాణము గావించుట, దివ్యప్రేమతో సత్యజ్ఞాన ప్రచారము గావించుటకై వేలాది కన్యలు, మాతలు తమ జీవన సర్వస్వమును ఈశ్వరీయ కార్యములో సమర్పించి పవిత్ర సేవలో నిమగ్నులై ఉండుట ఈ సంస్థయొక్క విశేషత.

1937వ సం॥లో భారతదేశమందలి సింధు హైదరాబాద్‌లో (యిప్పుడు పాకిస్థాన్‌లో కలదు) ఒక రత్నాల వ్యాపారియగు దాదా లేఖరాజ్ అనే వైష్ణవ భక్తాగ్రేసరుని శరీరములో పరమపిత పరమాత్మ నిరాకార జ్యోతిర్బిందు స్వరూపుడగు శివుడు పరకాయ ప్రవేశము చేసి, అనేక సాక్షాత్కారములు గావించి ప్రభోదించిన జ్ఞానమే ఈ సంస్థ స్థాపనకు మూలాధారము. పరమపిత శివుడు దాదా లేఖరాజ్‌కు "ప్రజాపిత బ్రహ్మ" అని కర్తవ్య నామకరణము చేసారు. తన సర్వస్వమును సమర్పించిన ఆ భాగ్యశాలి శరీరమనే రథమును పరమాత్మ శివుడు తన ఆసనముగా స్వీకరించి, ఈ దివ్యజ్ఞానమును మానవ సమాజమునకు ప్రసాదించినారు. ఈ దివ్య జ్ఞానము మానవుని మానసిక పరివర్తనకు, ఆత్మోన్నతికి సులభ ప్రయోజనకారి. ఇటువంటి విశిష్ట జ్ఞానము మానవ మాత్రులకు అసాధ్యమని, ఒక్క పరమేశ్వరునికి మాత్రమే సాధ్యమని ప్రతి నిత్యము ఈ జ్ఞానానుభవము పొందే వారికి సునాయాసముగా అనుభూతి కలుగుతుంది.

ప్రస్తుతము ఈ సంస్థ ముఖ్యకేంద్రము రాజస్థాన్‌లోని ఆబూ పర్వతముపై నెలకొని ఉన్నది. ప్రపంచమంతట 90 దేశాలలో ఈ సంస్థయొక్క శాఖలు, ఉపశాఖలుగా విస్తరించి 7500 వరకు ఉన్నవి.

1937 తరువాత 14 సంవత్సరములు ఈ సంస్థలోని 400 మంది కన్యలు, మాతలు, సోదరులు పరిపూర్ణ ఏకాంత తపస్సు గావించి, విశిష్ట జ్ఞానయోగ సంపన్నులైన పిదప ఈశ్వరాజ్ఞననుసరించి లోక కళ్యాణార్థము శాఖలు ప్రారంభమైనవి.

**స్వయం పరివర్తనయే విశ్వపరివర్తన**

మొట్టమొదటి శాఖ 1953లో స్థాపించబడినది. ఈ సంస్థ శాఖలు ఆయా ప్రదేశములలోని జిజ్ఞాసువుల ఆహ్వానములతో స్థాపించబడుతాయి. చందాలు స్వీకరించరు. ఎన్ని ఖర్చులైనను ఈ సంస్థలోని ఈశ్వరీయ విద్యార్థీ, విద్యార్థినులే ఇచ్చిన గుప్త సహకారము ద్వారా స్వచ్ఛందముగా నిర్వహిస్తారు. తమ దుర్వ్యసనములను విడిచిపెట్టి పొదుపు చేసిన ధనమును వీరు ఈశ్వరీయ కార్యాలలో వినియోగిస్తారు.

"మాత ప్రథమ గురువు" అని పెద్దలు అంటారు. కుటుంబ పోషణలోగాని, శిశువుల ఆరోగ్య సంరక్షణలోగాని స్త్రీలు, నర్సులు చూపించినంతగా శ్రద్ధ పురుషులు చూపలేరు. మానవులలోని మానసిక బలహీనతలను పోగొట్టి, మరల వారిని శక్తి వంతులుగా చేయుటకు పరమేశ్వరుడు ఈ జ్ఞాన కలశమును కన్యలకు మాతలకు ఇచ్చారు. అంతేకాక ఈ జ్ఞాన యజ్ఞము ప్రారంభించినప్పటినుండి ముఖ్యముగా స్త్రీలు ఎక్కువగా ఆకర్షించబడినారు. కనుక ఈ సంస్థకు మొదటి నుండి బ్రహ్మాకుమారీ అను శబ్దము అన్వయమైనది. కాని ఈ సంస్థలో స్త్రీ, పురుషులు లక్షలమంది ప్రయోజనమును పొందుచున్నారు. ఈ స్త్రీ, పురుషులందరూ కూడా పరమాత్మునకు బ్రహ్మాముఖముద్వారా కలిగిన సంతానము కావున వారిని బ్రహ్మాకుమారీ, కుమారులు అని అంటారు. వీరే బ్రహ్మా మానస పుత్రులు లేక బ్రహ్మాముఖ వంశావళి బ్రాహ్మణులు. ఇది ఒక క్రొత్త జన్మ.

తాము పొందుచున్న ఈ విశిష్ట ఆధ్యాత్మిక జ్ఞానమును తమ వరకే పరిమితము గావింపక విశ్వ కాళ్యాణార్థము, ఈ సంస్థ ప్రపంచ ప్రజలకు మెడికల్ వింగ్, సోషల్ వింగ్, పొలిటికల్ వింగ్,.... ఎడ్యుకేషన్ వింగ్,... మొదలైన 18 విభాగాల ద్వారా, ఉపన్యాసములు, యోగశిబిరములు, చిత్ర ప్రదర్శనలు, జ్ఞానగోష్ఠులు, చర్చలు, స్నేహసమావేశములు, స్లైడ్‌షోలు, ఫిలింషోలు, పత్రికలు మరియు సాహిత్యము ద్వారా ప్రచారము చేయుచున్నది. ఈ సంస్థలో ప్రతి నిత్యము ఉదయము, సాయంత్రము జ్ఞాన తరగతులు నిర్వహింపబడతాయి. సహజరాజయోగాభ్యాసము కూడా చేయిస్తారు. ఇందులో ఎటువంటి రుసుము చెల్లించనవసరము లేదు.

ఈ విధముగా ఈ సంస్థ త్వరలో రాబోయే విశ్వపరివర్తనకు తగిన భూమికను నిర్మించుచున్నది. సుఖ సంపన్నమైన విశ్వరాజ్యమునకు, బంగారు యుగమునకు ఈ సంస్థ పూల బాటవేయుచున్నది. ప్రస్తుతము ఈ సంస్థ ప్రపంచ ఐక్యరాజ్యసమితి **(UNO)** లో **(NGO)** సలహాదారు సభ్యత్వము గల సంస్థగా ఉండి విశిష్ఠ సేవ చేయుచున్నది.

ప్యూరిటి, వరల్డ్ రెన్యువల్ మరియు జ్ఞానామృత్ అనే మాస పత్రికలు ఇంకా ఇతర ప్రాంతీయ భాషలలోనూ మాస పత్రికలు ప్రచురించి సేవ చేయుచున్నది.

ఈ విశిష్ఠ సంస్థతో సంబంధముంచుకొని దివ్య ప్రయోజనము పొందుటకు విశ్వమానవాళికి సదా సుస్వాగతం.

స్థానిక చిరునామా :

**గుణాలదానమే మహాదానము**

# పథ ప్రదర్శని

ఏ మానవుడైనా దుఃఖము, అశాంతితో ఉన్నపుడు “ఓ దుఃఖ హర్తా ఆనంద ప్రదాయకా! ప్రభూ! మాకు శాంతినివ్వు” అని ప్రార్థిస్తాడు. మనో వికారములకు లోనైన మనిషి పవిత్రత కోసం పరమాత్ముని వేడుకుంటాడు. తండ్రీ మా పాపములను పోగొట్టు! మనో వికారములను తొలగించు! మాలోని చెడులను తొలగించి పవిత్రులుగా చేయి.” అని ప్రార్థిస్తారు, కాని ఈ విషయ వికారములను తొలగించుటకు ప్రసాదించబడిన ఈశ్వరీయ జ్ఞానము, సహజరాజయోగములను తెలుసుకొనుట కష్టమని, ఆచరించుట మరీ కష్టమని భావిస్తారు. ఇపుడు పరమపిత పరమాత్మ మనకు సహజ రాజయోగమార్గము చూపిస్తున్నారు. కానీ, స్వీయ ప్రయత్నము లేనిదే జీవితములో నిజమైన సుఖశాంతులు లభించవని గ్రహించాలి.

రాబోయే పుటలలో పరమాత్మ ప్రబోధించిన సత్యజ్ఞాన, సహజ రాజయోగ మార్గము వివరించబడినది. ఈ రహస్యములన్నీ అరటిపండు ఒలిచి అరచేతిలో పెట్టినట్లుగా అర్థమయ్యేందుకు ఎన్నో చిత్రములు, వాటికి విపులమైన వ్యాఖ్యలు ఉన్నాయి. దీనిని చదవడం వలన మీకెన్నో జ్ఞాన రత్నాలు లభిస్తాయి. ఈ రాజయోగాన్ని ప్రయోగాత్మకంగా నేర్చుకొనుటకు మా ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కేంద్రములన్నీ ఉచితముగా తోడ్పడుతాయి. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని మా మనవి.

## అమృత సూచిక


1. పరిచయము
2. పథ ప్రదర్శని
3. ఆత్మ అనగా ఏమి? మనస్సు అనగా ఏమి?
4. ముల్లోకములు ఏవి? పరమాత్మ శివుని నివాస ధామము ఏది?
5. నిరాకార శివపరమాత్మ పరిచయము
6. సర్వాత్మలకు పిత నిరాకార శివపరమాత్మ
7. పరమపిత పరమాత్మ మరియు అతని దివ్య కర్తవ్యములు
8. పరమాత్ముని దివ్యావతరణము
9. శివ శంకరుల తారతమ్యము
10. భగవంతుడు సర్వవ్యాపి కాదు
11. కల్ప వృక్షమునకు బీజము పరమాత్మ శివుడు
12. పరమాత్ముని సంప్రాప్తింపచేయు గుప్త యుగమే పురుషోత్తమ సంగమయుగము
13. మానవుని 84 జన్మల అద్భుత జీవిత చరిత్ర
14. మానవ ఆత్మ 84 లక్షల యోనులను ధరించదు
15. ఈశ్వరీయ విశ్వ విద్యాలయ పరిచయము
16. పితాశ్రీ బ్రహ్మా మరియు జగదంబ సరస్వతి పరిచయము
17. సృష్టి నాటక కర్త మరియు దర్శకుడు ఎవరు?
18. ఇపుడు కలియుగము ప్రథమ పాదంలో లేదు. అంతిమ దశలో ఉన్నది.
19. రావణుడు ఎవరు? రావణునికి పది తలలు ఉన్నాయా?
20. మానవ జీవితముయొక్క పరమ లక్ష్యము
21. సమీప భవిష్యత్తులో శ్రీకృష్ణుడు మరల వచ్చు చున్నాడు.
22. సర్వశాస్త్ర శిరోమణి శ్రీమద్భగవద్గీతా జ్ఞానదాత ఎవరు?
23. గీతా జ్ఞానము హింసా యుద్ధము చేయుటకు బోధించలేదు
24. జీవితమును కమలపుష్ప సమానముగా చేసుకొను విధానము
25. రాజయెగమునకు ఆధారము మరియు విధానము
26. రాజయోగముయొక్క నియమములు
27. రాజయోగము ద్వారా అష్టశక్తుల ప్రాప్తి
28. రాజయోగము ద్వారా స్వర్గ ప్రాప్తి
29. ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య సేవా కేంద్రములు
30. ఆధ్యాత్మిక జాగ్రుతి కలిగించే సాహిత్యము


**ఆత్మ జ్యోతిని వెలిగించు అంధకారము తొలగించు**

# మీరొక ఆత్మ

నిత్య వ్యవహారంలో "మానవుడు ఎన్నో సార్లు "నేను", "నేను" అనే పదము వాడుతూ ఉంటాడు. కాని, వింత ఏమిటి అంటే ఎన్నో సార్లు వాడుతూ కూడ "నేను", "నాది" అనే మాటల నిజమైన అర్థము, "నేను" అనే శక్తియొక్క అసలైన స్వరూపము, అది ఏ వస్తువును సూచిస్తుంది" అనే విషయం ఎవరికీ తెలియదు. నేడు మానవుడు సైన్సు ద్వారా ఎన్నో సమస్యలకు సమాధానం కనుగొన్నాడు. శక్తివంతమైన సాధనాలు ఎన్నింటినో తయారుచేసాడు. మరెన్నో సమస్యలకు పరిష్కార మార్గం కనుగొనడానికి ప్రయత్నం చేస్తున్నాడు. కానీ ఈ "నేను" ఎవరు? అనే సత్య విషయం గురించి అతనికి తెలియదు. ఇపుడు ఎవరిని అడిగినా నేను ఎవరు అంటే తమ శరీరము పేరు లేదా తమ వృత్తి గురించి చెబుతారు.

నిజానికి ఈ "నేను" అనే శబ్దము శరీరమునకు వేరైన ఒక చైతన్య శక్తియగు "ఆత్మ"ను సూచిస్తుంది.ఇదే ఎదురుగా ఉన్న చిత్రములో చూపబడినది. "ఆత్మ మరియు శరీరముల" సమ్మేళనమే జీవాత్మ. భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము అనే ఐదు మూల ప్రకృతి పదార్థాల సమ్మేళనమే శరీరమైనట్లు ఆత్మ కూడ మనస్సు, బుద్ధి, సంస్కారములను కలిగి ఉంటుంది. ఆత్మయే ఆలోచనాశక్తి, నిర్ణయశక్తి కలిగి తను చేసిన కర్మలకు అనురూపమైన సంస్కారాలు కలిగి ఉంటుంది.

ఆత్మ మానవ దేహంలో భృకుటి మధ్య అవినాశి చైతన్యవంతమగు జ్యోతిర్బిందు స్వరూపముతో విరాజమానమై ఉంటుంది. దివ్య దృష్టితో చూస్తే ఈ ఆత్మ రాత్రిపూట ఆకాశంలో మినుకు మినుకుమనే నక్షత్రంవలె కనిపిస్తుంది అందుకే ఒక కీర్తనలో "నుదుట మెరిసే నొక్క అద్భుత తార, ప్రేమతో చూచిన ప్రభువు దొరకునుర" అన్నారు.

భృకుటి (కనుబొమ్మలమధ్య) ఆత్మకు నివాస స్థానం. కనుకనే తీవ్రముగా ఆలోచించే సమయంలో ఎవరైనాసరే "నాగీత బాగాలేదు, నా వ్రాత ఇలా తగులబడింది" అంటూ చేతితో నుదురు స్పృశిస్తూ అనుకొంటారు. భక్తులు తిలకమును, కనుబొమ్మల మధ్య పెట్టుకొనే కారణం కూడా ఇదే.

ఇక్కడ ఆత్మకూ మెదడుకూ సంబంధం కలుగుతుంది. మెదడుకు, శరీరంలో అంతటా వ్యాపించి ఉన్నజ్ఞాన నాడులకూ క్రియాశక్తికి చెందిన నాడులకు సంబంధం ఉన్నది. ఆత్మలోనే మొదట సంకల్పం కలిగి మెదడు మరియు నాడుల ద్వారా వ్యక్తమవుతుంది. ఆత్మయే శాంతి లేక దుఃఖమును అనుభవిస్తుంది. నిర్ణయాలు చేసుకుంటుంది. సంస్కారములు అలవర్చుకుంటుంది. ఈ కారణం చేత మనస్సు, బుద్ధి ఆత్మకు వేరుగా లేవు. కాని ఆబాల, వృద్ధులు, స్త్రీ, పురుషులు అంతా ఆత్మను మరచి దేహాభిమానులు అగుటయే అన్నిదుఃఖాలకు మూలకారణము అని గ్రహించాలి.

పై రహస్యమును మోటారుకారు మరియు డ్రైవరు ఉదాహరణ ద్వారా స్పష్టము చేస్తున్నారు. శరీరము మోటారు కారు లాంటిదైతే ఆత్మ దీని డ్రైవరు. అంటే డ్రైవరు, మోటారును అధీనంలో ఉంచుకున్నట్లు ఆత్మ, శరీరాన్ని అదుపు ఆజ్ఞలలో ఉంచుకుంటుంది. ఆత్మలేని శరీరం శవం లాంటిది. కావుననే పరమపిత శివపరమాత్మ "తనను తాను తెలుసుకున్నట్లయితే తన శరీరము అనే కారును సక్రమంగా నడిపించి లక్ష్యమును చేరుకొనగల్గుతాడు" అని బోధిస్తారు. అజ్ఞాని చేతిలో ఈశరీరము, చేతగాని డ్రైవరు చేతిలోని కారులాగ ప్రమాదాల పాలై చివరకు తనను నమ్ముకొనిన తోటివారికి కూడ ప్రాణహాని కలిగిస్తుంది. ఆత్మ జ్ఞానము లేనివారి కుటుంబము, బంధుమిత్రులు అందరూ దుఃఖము, అశాంతిని అనుభవించ వలసి వస్తుంది. అందుచే నిజమైన సుఖశాంతులు పొందుటకు ఆత్మ జ్ఞానము చాలా అవసరము.

**ఆత్మాభిమాని అందరికంటే గొప్ప జ్ఞాని**

# మీరొక ఆత్మ


ఆత్మ
మనస్సు
బుద్ధి
సంస్కారము
అస్థిపంజరం
జీవాత్మ
శరీరమనే మోటారు
డ్రైవరు, మోటారును నియంత్రించినట్లు
ఆత్మ, శరీరాన్ని నియంత్రించును

# ముల్లోకములు ఏవి? పరమాత్మ శివుని నివాస ధామము ఏది?



# ముల్లోకములు ఏవి? పరమాత్మ శివుని నివాస ధామము ఏది?

ప్రతి మానవాత్మ ముక్తిని, సంపూర్ణ శాంతిని కోరుకుంటుంది. కానీ ఆ ముక్తిధామము లేక శాంతి ధామము ఎక్కడ ఉంటుందో ఎవరికీ తెలియదు. అదే విధంగా పరమ ప్రియుడైన శివ పరమాత్మునితో కలుసుకొనవలెనని ప్రతివారు ఎదురుచూస్తారు. కానీ, ఈ సర్వ సృష్టికి మూలస్థానమగు శివలోకము ఎక్కడ ఉన్నదో ఎవరికీ తెలియదు. ఈ ప్రపంచ నాటక రంగమునకు ఎక్కడ నుంచి వచ్చారో మరల తిరిగి అక్కడకు చేరుకొను ప్రయత్నమైనా చేయకపోవుట ఒక విచిత్రం.

**1. సాకార మనుష్య లోకము**:- ఎదురుగా ఉన్న చిత్రములో చూపినట్లు మనము ఉండే ఈ సాకార మనుష్య లోకము మూడు లోకములలో ఒకటి. జీవాత్మలన్నీ ఇక్కడ రక్తమాంసములతో కూడిన స్థూల శరీరముతో వ్యవహరిస్తూ తమ తమ కర్మలకు తగిన ఫలితములను అనుభవిస్తూ జనన మరణాల వలయములో చిక్కుకొంటాయి. ఈ లోకములో సంకల్పము-ధ్వని మరియు "కర్మ" అనే మూడు విషయములు వుంటాయి. దీనినే పంచతత్వముల సృష్టి లేక కర్మ క్షేత్రము అని కూడా అంటారు. ఈ విషయము ఎదురుగా ఉన్న త్రిలోకముల చిత్రము నందు తలక్రిందులుగా ఉన్న వృక్షాకారముగా చూపించబడినది. ఎందువలన అనగా జనన మరణాతీతుడు బీజరూపుడైన పరమాత్మ శివుడు ఈసృష్టి అనే వృక్షమునకు పై భాగమున ఉంటారు.

**2. సూక్ష్మదేవతా లోకము**:- ఈ మానవ లోకము పైన సూర్య, చంద్ర, నక్షత్ర మండలములను దాటి ఆకాశ తత్వమునకు పైన ఒక సూక్ష్మమైన తేజోలోకము ఉంటుంది. ఇది జ్యోతిర్మయము. ఈ వెలుగు వెల్లువలో బ్రహ్మ, విష్ణు, శంకరుల వేరువేరు పురములు ఉంటాయి. ఈ దేవతల శరీరములు అస్థి మాంసములతో కాక కేవలం ప్రకాశ మూర్తులుగా ఉండి దివ్య చక్షువులకు మాత్రమే గోచరిస్తాయి. ఇక్కడ దుఃఖము కాని, అశాంతి కాని ఉండవు. సంకల్పములు, సైగలు సంభాషణలు ఉంటాయి. కాని ధ్వని ఉండదు.

**3. బ్రహ్మలోకము లేక పరలోకము**:- ఈ పురములన్నిటికీ పైన మరో లోకము ఉంటుంది. దానినే బ్రహ్మలోకము, పరలోకము, ముక్తి ధామము, నిర్వాణ ధామము, శాంతి ధామము, శివలోకము అని అంటారు. ఈ దివ్యలోకము నందు అంతటా బంగారపు, ఎరుపురంగుల కాంతి పుంజము వ్యాపించి ఉంటుంది. దీనినే బ్రహ్మతత్వము, ఆరవ తత్వము లేక మహాతత్వము అంటారు. దీనిలోని ఒక అంశమాత్ర భాగములో జ్యోతిర్బిందు స్వరూపమైన ఆత్మలు ముక్తావస్థలో ఉంటాయి. ఇక్కడ విభిన్న మత ధర్మములకు చెందిన వారు వారి వారి శాఖలతో కూడి ఉంటారు. వీటన్నిటికి పైన నిత్యముక్తుడు, శుద్ధ చైతన్య మూర్తి, జ్యోతిర్బిందు స్వరూపుడైన పరమాత్మ సదాశివుడు విరాజమానుడై ఉంటారు. ఈ లోకమునకు జీవాత్మలన్నీ కల్పాంతమున సృష్టి మహా వినాశనము చెందిన తర్వాత తమ తమ కర్మ ఫలములను అనుభవించి పవిత్రులైన తదనంతరమే చేరుకొంటాయి. ఇక్కడ మానవాత్మలు దేహబంధన, కర్మబంధన, జనన మరణాది బంధనములు మరియు వాక్కు, కర్మ, సంకల్ప రహితులై ఉంటారు. ఈ లోకమునకు చేర్చగలవాడు ఒక్క పరమాత్మ శివుడు తప్ప ఇతర గురువులెవ్వరికీ సాధ్యము కాదు. ఈ లోకమునకు చేరుకొనుటయే అమరనాథ్, కాశీ రామేశ్వరాది తీర్థయాత్రలవుతాయి. ఎందుకంటే అమరనాధుడైన పరమాత్మ శివుడు ఈ లోకంలోనే నివసిస్తారు.

నేను నిమిత్తమాత్రుడననుకొనుటయే నిజమైన విశ్రాంతి

# నిరాకార పరమపిత-శివపరమాత్మ పరిచయము

సాధారణంగా మానవులందరూ పరమాత్ముని, ఓ తండ్రీ! దుఃఖహర్తా! సుఖప్రదాతా! ప్రభూ! అని తమకు భగవంతునితో గల ఆత్మీయమైన సంబంధమును వ్యక్త పరుస్తూ స్మృతిస్తుంటారు. కానీ, ఎవరిని తండ్రీ అంటున్నారో ఆయనను గురించి వారికి సరియైన జ్ఞానం లేదు. అతనియొక్క స్పష్టమైన పరిచయంకానీ, నిజమైన సంబంధముకానీ అతని ఎడల విశుద్ధమైన ప్రేమకానీ లేకపోవుట చాలా ఆశ్చర్యకరమైన విషయము. యదార్థ జ్ఞానము, ప్రేమ లోపించుటచేతనే పరమాత్మను ధ్యానము చేయునప్పుడు మనస్సు ఏకాగ్రం కాలేదు. ఈ కారణము చేత మన జన్మసిద్ధాధికారమైన సుఖశాంతులు లోపించాయి. భగవంతుని మధుర సమాగమంలోని యదార్థ సుఖమును కూడా పొందలేరు. వారి సంస్కారాలలో గానీ, జీవితంలోగానీ చెప్పుకోదగిన సత్పరిణామము రాదు. కావున లోక కళ్యాణార్థము పరమపిత పరమాత్మ స్వయంగా బోధించి అనుభవం చేయించిన పరమాత్మ పరిచయమును సంక్షిప్తముగా వివరిస్తున్నాము.

## పరమపిత పరమాత్మ దివ్యనామము మరియు మహిమ

పరమపిత పరమాత్మ దివ్యనామము "శివుడు". శివుడనగా కళ్యాణకారి అని అర్థము. అతడు జ్ఞాన సాగరుడు, శాంతి సాగరుడు, ఆనందపయోనిధి, ప్రేమ సాగరుడు, పతిత పావనుడు. పరమాత్మ జీవాత్మలెల్లరకూ సుఖశాంతి నిలయమును చూపు మార్గదర్శి. మానసిక వికారములనే కాలపాశము నుండి ముక్తి కలిగించువాడు సకల జీవకారుణ్యమూర్తి. గతి సద్గతి దాత, దివ్యబుద్ధి మరియు దివ్యదృష్టిప్రదాత. అతడే జ్ఞానామృతముతో అమరత్వమును కలిగించే సోమనాథుడు లేక అమరనాథుడు. అతడు జనన-మరణ బంధన రహితుడై ఏకీరస స్థితి యందుంటాడు. అతడు ప్రకాశించుచున్న జ్యోతి స్వరూపుడు. "సదా శివుడ"నే శాశ్వత నామధేయుడు.

## పరమాత్ముని దివ్య రూపము

పరమపిత పరమాత్ముని దివ్యరూపము జ్యోతిర్బిందువు. ఇది అతి నిర్మలముగా, ఎర్రని బంగారు వర్ణములో దేదీప్యమానముగా ప్రకాశించుచూ మనోహరముగా ఉంటుంది. ఆ దివ్యమైన జ్యోతిర్మయ స్వరూపమును గాంచుటకు దివ్య చక్షువులు, అనుభూతి చేసుకొనుటకు దివ్యబుద్ధి అవసరము. ఈ జ్యోతిర్బిందు స్వరూపమే భారతదేశములో శివలింగ రూపముతో పూజింపబడుచున్నది. పరమాత్మ శివుని అవతరణమునకు స్మృతి చిహ్నముగా "మహాశివరాత్రి" కూడా జరుపబడుచున్నది.

**నిరాకారుడు అను పదము యొక్క అర్థము**

దాదాపు అన్ని మతాలవారు భగవంతుని నిరాకారుడని అంగీకరిస్తారు. 'నిరాకారుడను', శబ్దమునకు అర్థము పరమాత్మకు ఏవిధమైన ఆకారము లేదనే చెప్తుతారు. కానీ పరమపిత పరమాత్మ మాత్రము ఈ అభిప్రాయము అజ్ఞాన పూర్వకమైనదని చెప్పుచున్నారు. నిజానికి నిరాకారుడనగా పరమాత్మునకు మానవులవలె స్థూల శరీరము గానీ, దేవతలవలె సూక్ష్మ రూపముగానీ లేదని అశరీరి, జ్యోతిర్బిందు స్వరూపుడని అర్థము. ఈ విధంగా సూక్ష్మాతిసూక్ష్ముడై ఒక జ్యోతి కిరణముగా నున్న పరమాత్ముని ప్రతి కణకణములో ఉన్నాడనుట ఒక ఆశ్చర్యకరమైన విషయము.

**భగవంతుని మీద బాధ్యత వదిలిన వారే భాగ్యశాలులు**

# నిరాకార పరమపిత శివ పరమాత్మ పరిచయము

పరమపిత శివ పరమాత్మ

- సర్వశక్తిమాన్
- ఆనందసాగరుడు
- అకాలమూర్తి
- దివ్య బుద్ధి దాత
- త్రికాలదర్శి
- శాంతి ధాత
- నిరాకారుడు
- బ్రహ్మలోక నివాసి
- జ్ఞానసాగరుడు
- ప్రతి ఆత్మల తండ్రి
- పరమ సద్గురువు
- జనన మరణాతీతుడు
- శాంతి సాగరుడు
- సద్గతిదాత
- ప్రేమాంబుధి
- పతిత పావనుడు

…తా జ్ఞాన దాత

# సర్వాత్మలకు పిత నిరాకార శివపరమాత్మ




సర్వధర్మాల వారు పరమాత్మను, నిరాకారుడు అనగా అశరీరిగా భావిస్తారు. భారతదేశం నలుమూలలలో మరియు అనేక దేశాలలో జ్యోతిర్బిందు పరమాత్మను శివలింగము రూపములో స్మృతిస్తారు. పరమాత్మ శివుడు, సర్వాత్మలకు పరమపిత, పరమశిక్షకుడు మరియు పరమసద్గురువు. కనుక నిరాకార జ్యోతిర్బిందు స్వరూపుడైన శివ పరమాత్మను స్మృతిచేసి, పాపాల నుండి ముక్తులు కండి.

# సర్వాత్మలకు పిత నిరాకార శివపరమాత్మ

మనవారు "హిందూ, ముస్లిం, సిక్కు, ఇసాయీ భాయీ, భాయీ" అని నినాదాలిస్తారు. కానీ వీరంతా సోదరులు ఎలా అయ్యారు? వీరందరికి తండ్రి ఎవరు? దీనికి సమాధానము ఎవరికీ తెలియదు. దైహికంగా ఎవరి తల్లిదండ్రులు వారికి వేరువేరుగా ఉన్నపుడు అందరూ సోదరులు ఎలా కాగలరు? ఆత్మ దృష్టితో చూసినపుడు మాత్రమే, పరమాత్ముని సంతానమగుట చేతనే సోదరులగుట సంభవిస్తుంది. ఇక్కడ సర్వాత్మల పితయగు, నిరాకారుడగు పరమాత్ముని సత్య పరిచయాన్ని గ్రహించి ఈ విషయమును స్మృతిలో వుంచుకున్నపుడు జాతీయ సమైక్యత ఏర్పడుతుంది.

చాలా వరకు అన్ని మతాలవారు భగవంతుడు ఒక్కడే అని, ఆయన మనందరకు తండ్రియనీ మానవులంతా సోదరులని అంటారు. కానీ ఆ ఒకే ఒక తండ్రి ఎవరు? ఇది ఒక ప్రశ్న. విభిన్న మతాలను, విభిన్న వ్యక్తులు స్థాపించినప్పటికి అన్ని మతాలవారు ఏదో ఒక రూపంలో నిరాకార జ్యోతిర్బిందు స్వరూపుని చిహ్నామగు శివలింగమును ఆరాధించుచున్నారు. భారతదేశంలోని దేవాలయములలో అధిక సంఖ్యలో శివాలయాలున్నాయి. భక్తులు "ఓం నమఃశ్శివాయ", "త్వమేవ మతాచ పితాచ" అని ప్రార్థిస్తారు. రాముడు, కృష్ణుడు మొదలగు దేవతలకు కూడా శివుడే దేవాదిదేవుడని, పరమపూజ్యుడని భావిస్తారు. మనదేశంలోనే గాక ఇతర దేశాలలోని అనేక మతాలవారు కూడా శివారాధనాతత్పరులే. ఎదురుగా ఉన్న చిత్రములో శివుని స్మృతి చిహ్నామగు "శివలింగము" అన్ని మతాలలోను గౌరవించబడుచున్నదని, ఆరాధనీయమైనదని స్పష్టముచేయబడినది.

అమరనాథ్, విశ్వనాథ్, సోమనాథ్ మొదలగు దేవాలయాలలో పరమపిత పరమాత్ముని స్మృతి చిహ్నాలే ఆరాధించబడుచున్నవి. "గోపేశ్వరము, రామేశ్వరములలోని దేవాలయములను అనుసరించి శివుడు, శ్రీరామునకు, శ్రీకృష్ణునకు కూడ పూజ్యనీయుడని స్పష్టమగుచున్నది. విక్రమాదిత్య మహారాజు కూడా శివుని పూజించేవాడు. ముసల్మానుల తీర్థయాత్రాస్థలమగు మక్కాలో కూడా లింగాకారములో ఉన్న "సంగ్-ఎ-అస్వద్" అనే శిల కలదు. దీనిని ముసల్మాను యాత్రికులు ఎంతో ప్రేమ, గౌరవములతో ముద్దు పెట్టుకుంటారు. దీనిని ఇబ్రహీం మరియు మహ్మద్ స్థాపించారని వారి ఉద్దేశ్యము. కాని ఈనాటి వరకు విగ్రహారాధనను తిరస్కరించే తమ మతములో ఈ అంశము ఎలా ప్రవేశించినదో, ఈ ఆచారమునకు మూలమేదో వారికే తెలియదు. ఇటలీలోని రోమన్ కాథలిక్కులు చాలా మంది శివ లింగము లాంటి ఒక ప్రతిమను తమ పద్ధతిలో పూజిస్తారు. క్రైస్తవ మతస్థాపకుడైన "జీసస్", సిక్కు మత స్థాపకుడైన "నానక్" భగవంతుని ఒక నిరాకార జ్యోతిగానే భావించారు. యూదు మతస్థులు పరమాత్ముడను "యహోవా" అంటారు. ఇది శివ శబ్దమునకు మారుపేరు. జపాన్‌లో బౌద్ధులు కూడ ఇదే ఆకారపు ప్రతిమను ఎదురుగా నిలుపుకొని ధ్యానిస్తారు.

కానీ కాలక్రమంలో అన్ని మతాలవారు కూడా ఈ ముఖ్యవిషయమును మరచిపోయారు. మనందరికి పరమపితయగు పరమాత్ముని స్మృతి చిహ్నామే "శివలింగ" మనే విషయం జ్ఞాపకముంటే ముస్లిములు సోమనాథ దేవాలయమును దోచుకొనేవారే కారు. ముస్లిములు, క్రైస్తవులు మొదలైన అన్ని మతాల వారు భారతదేశమును పరమపిత పరమాత్ముని అవతార భూమిగా, ప్రపంచములో కెల్లా పరమ పావన తీర్థ స్థలముగా భావించినట్లయితే చరిత్రగతియే మరొక రకంగా ఉండేది. కానీ, తమ పరమపిత పరమాత్మను విస్మరించుటచేతనే ఈనాటి ప్రపంచంలో ఆవేశకావేశాలు, ఈతిబాధలు, దుఃఖము, అశాంతి వ్యాపించి అనాథలుగా మారిపోయారు.

**చింతలను వీడి పరమాత్మ చింతన చేయండి**

# పరమపిత పరమాత్మ మరియు అతని దివ్య కర్తవ్యములు

ఎదురుగా ఉన్న జ్యోతిర్బిందు స్వరూపుడగు శివుని చిత్ర పటములో కలియుగాంతమున ధర్మగ్లాని ఏర్పడి అజ్ఞానాంధకారము సర్వత్ర వ్యాపించినపుడు శివ పరమాత్మ లోకకళ్యాణార్థము బ్రహ్మ, విష్ణు, శంకరులనే ముగ్గురు సూక్ష్మ దేవతలను సృష్టించునని వివరిస్తున్నారు. కావుననే 'శివుడిని' త్రిమూర్తి అంటారు. ఈ విధంగా త్రిమూర్తులను సృష్టించిన అనంతరము పరమాత్ముడే స్వయముగా ఈ మానవలోకంలో ఒక సాధారణ వృద్ధ భక్తుని శరీరంలో అవతరించి ఆ భక్తునికి ప్రజాపిత బ్రహ్మ అని నామకరణం చేస్తారు. భాగ్యశాలి ప్రజాపిత బ్రహ్మ శరీరము ద్వారా శివుడు మనుష్యాత్మలకు పరమపిత, పరమ శిక్షకుడు, పరమ సద్గురువుగా అయ్యి సత్యగీతా జ్ఞానమును, సహజరాజయోగమును ప్రబోధించి సద్గతిని అనగా జీవన్ముక్తిని ప్రసాదిస్తారు.

## శంకరుని ద్వారా కలియుగ సృష్టి మహా వినాశనము

పరమపిత పరమాత్మ శివుడు కలియుగాంతమున ప్రజాపిత బ్రహ్మద్వారా సత్యయుగ దేవతా సృష్టి పునఃస్థాపన గావించుటతో పాటు శిధిలమైన అసురీసృష్టి వినాశన కార్యక్రమమును కూడా ప్రారంభిస్తారు. "శివపరమాత్మ" "శంకరుని"ద్వారా విజ్ఞాన గర్వితులై, విపరీత బుద్ధులైన అమెరికన్‌లను, యూరోపియన్‌లను (యాదవులు) ప్రేరేపించి, వారి ద్వారా ఆటంబాంబు, హైడ్రోజన్ బాంబులు, "మిస్సెల్స్" లాంటి మారణాయుధాలు (మహాభారతంలో వీటినే "ముసలకం" "బ్రహ్మాస్త్రా"దులు అని అన్నారు) ప్రయోగించు కొనునట్లు చేస్తారు. భారత దేశంలో కూడా దేహాభిమానులు-ధర్మభ్రష్టులు విపరీత బుద్ధులైన వారికి (మహాభారతంలోని కౌరవులు వీరే) అంతర్యుద్ధమునకు ప్రేరణ కలిగిస్తారు.

## శ్రీ విష్ణువు ద్వారా జగత్పాలన

విష్ణుమూర్తి నాలుగు భుజములలో రెండు "శ్రీనారాయణుని" భుజములకు, రెండు "శ్రీలక్ష్మి" భుజములకు చిహ్నాములు. శంఖము పవిత్ర వాక్కునకు, జ్ఞాన ఝుంకారమునకు గుర్తు. "స్వదర్శన చక్రము" ఆత్మ (స్వ) మరియు సృష్టి చక్ర జ్ఞానమునకు నిదర్శనము. "కమలపుష్పము" ప్రపంచములో ఉండి కూడ "నిర్లిప్తం"గా, పవిత్రముగా ఉండుటకు సూచన. గద, మాయపై విజయమునకు (పంచేంద్రియ వికారముల వినాశనమునకు) చిహ్నాము.

ఇపుడు పరమపిత పరమాత్మ జీవాత్మలందరికి విష్ణు చతుర్భుజుని ఈ విధంగా సందేశమిస్తున్నారు.

"ఈ అలంకారముల రహస్యమును తెలుసుకుని మీ జీవితములో పాటించినట్లయితే నరుడు నారాయణుని పదవిని, నారి లక్ష్మి పదవిని పొందగలరు. మానవులు ద్వికిరీటధారులై దేవీ దేవతా పదవిని పొందుతారు." రెండు కిరీటములలో **1. ప్రకాశమండలము.** ఇది సంపూర్ణ పవిత్రతకు, శాంతికి చిహ్నాముగా విరాజిల్లుతుంది. **2. రత్న స్థగితమైన స్వర్ణకిరీటము.** ఇది సంపద, సుఖము, రాజ్యభాగ్యమునకు చిహ్నాము.

ఈ విధముగా పరమపిత శివ పరమాత్మ సత్య, త్రేతాయుగముల పవిత్రమైన దేవతా సృష్టి (స్వర్గ) పరిపాలనను నెలకొల్పుతారు. దీనికి ఫలితముగా సత్యయుగములో శ్రీ లక్ష్మి నారాయణులు (వీరే పూర్వజన్మలో ప్రజాపిత బ్రహ్మ జగదంబ సరస్వతులు) మరియు సూర్య వంశీయులైన రాజులు రాజ్యపాలన చేస్తారు. త్రేతాయుగములో శ్రీ సీత, శ్రీరాముడు మరియు ఇతర చంద్రవంశీయులైన రాజులు రాజ్యపాలన చేస్తారు.

ఇచట మనం ఒక ముఖ్యమైన విషయం గమనించాలి. ప్రస్తుతం పరమపిత శివపరమాత్మ ప్రజాపిత బ్రహ్మ, విష్ణు, శంకరులద్వారా పైన పేర్కొన్న మూడు కర్తవ్యములను చేయించుచున్నారు. ఇపుడు పరమాత్మతోను, ప్రజాపిత బ్రహ్మతోను ఆత్మీయతను అనగా ఆత్మసంబంధమును కల్గించుకొని, పవిత్రులై స్వచ్ఛమైన వైష్ణవులుగా తయారగుటయే మనందరి కర్తవ్యము. తీవ్రపురుషార్థముచే వీటిని సాధించగానే ఈశ్వరీయ జన్మ సిద్ధాధికారమైన ముక్తి-జీవన్ముక్తి వెంటనే లభిస్తుంది.

**నిర్మాణ చిత్తులే విశ్వ నవ నిర్మాతలు**

# పరమపిత పరమాత్మ మరియు అతని దివ్య కర్తవ్యములు



# శివ పరమాత్ముని దివ్యావతరణము



# పరమాత్ముని దివ్యావతరణము

శివ శబ్దమునకు మంగళకరుడు, కళ్యాణదాయకుడు అని అర్థము. మానవులందరూ కలియుగాంతమున మాయకు లోబడి అశాంతి, దుఃఖములపాలై భ్రష్టాచారులుగా, పతితులుగా అగుటచే అతి ధర్మగ్లాని ఏర్పడుతుంది. ఆ సమయముననే మానవాత్మలను పునః పవిత్రులుగా, సంపూర్ణ సుఖాధికారులుగా చేసే దివ్య కర్తవ్యమును గావించు కళ్యాణమూర్తి కావున "శివుడు" అను నామము అతనికి గుణవాచకమై సార్థకమైనది. ధర్మ భ్రష్టులుగా కర్మభ్రష్టులుగా పతనమైపోయిన మానవులను ఉద్ధరించుటకు శివపరమాత్మ పరంధామము నుండి దిగివచ్చి ఒక వృద్ధమానవ శరీరమును ఆధారముగా తీసుకుంటారు. పరమాత్మ శివుని ఈ దివ్యమైన అలౌకిక జన్మకు స్మృతి చిహ్నముగానే "శివరాత్రి" లేక "శివజయంతి" పర్వదినముగా జరుపుకొనబడుచున్నది.

పరమాత్మ ఈ విధముగా తాను ప్రవేశించినతని మనసును పూర్తిగా పవిత్రముగా చేసి "ప్రజాపిత బ్రహ్మ" అని పేరు పెట్టారు. ఇతని స్మృతి చిహ్నముగానే శివలింగము ఎదురుగా నంది విగ్రహముంటుంది. పరమాత్మ సర్వాత్మలకు తల్లి, తండ్రి. కావున ఆయన ఏ స్త్రీ గర్భవాసమందు జన్మించక ప్రజాపిత బ్రహ్మ శరీరములో పరకాయ ప్రవేశము చేయుటయే దివ్యజన్మ లేక దివ్యావతరణము అనబడుతుంది.

## "అభవుడైన పరమాత్ముని దివ్యజన్మ అత్యద్భుతం"

జననమరణ బంధన రహితుడు, మానవ సృష్టికి చైతన్య బీజరూపుడు, జగన్మాత, జగత్పితయగు పరమాత్మ శివుడు స్త్రీ గర్భములో జన్మించడు. కావుననే ఒక సాధారణ వృద్ధ మానవ తనువునందు ప్రవేశిస్తారు. ఇదే అతని దివ్యజన్మ. శివపరమాత్మ ప్రవేశించిన శరీరం జనన మరణ చక్రములో పరిభ్రమించే మానవశరీరం.కాని అది పరమాత్మ స్వంత దేహం కాదు. ఆయన అశరీరి.

చిత్రములో చూపబడినట్లు సమస్త సృష్టి మాయావశమై కామ, క్రోధ, లోభ, మోహ, అహంకారములనే అయిదు వికారములలో చిక్కుకొనిన సమయములో జనన మరణాతీతుడైన పరమాత్మ పవిత్రత-సుఖ శాంతులను ప్రసాదించి మాయ పిడికిలి నుండి విముక్తి కలిగిస్తారు. పరమాత్మయే సర్వాత్మలకు సత్యజ్ఞానము, సహజరాజయోగము ప్రభోదించి పరంధామమునకు తీసుకువెళతారు. అతడే ముక్తి, జీవన్ముక్తి ప్రసాదించే వరదాత.

శివరాత్రి పండుగ ఫాల్గుణ మాసం (విక్రమ శ.11) చివరలో వస్తుంది. కృష్ణపక్ష చతుర్థశినాడు పూర్తి అంధకారము వ్యాపించి ఉంటుంది. ఒక్కరోజు తరువాత శుక్లపక్షం ప్రారంభమవుతుంది. ఇక కొద్ది రోజులలోనే నూతన సంవత్సరం ప్రవేశిస్తుంది. ఈ ఫాల్గుణ కృష్ణ పక్ష చతుర్థశి నాటి రాత్రి, జీవాత్మల అజ్ఞానాంధకారమును, మానసిక వికారములు విజృభించిన రాక్షస లక్షణాల స్థితులను సూచిస్తుంది. దీని తరువాత ఆత్మలకు శుక్లపక్ష మనబడే నూతన కల్పము ప్రారంభమవుతుంది. అజ్ఞానము, అశాంతి దూరమై పవిత్రత, సుఖశాంతులు నెలకొంటాయి.

పరమాత్మ శివుడు అవతరించి తన జ్ఞానయోగములు, పవిత్రతల ద్వారా ఆత్మలలో ఆధ్యాత్మిక జాగృతి కలిగిస్తారు. ఈ మహత్యము యొక్క ఫలితముగా శివరాత్రి నాడు భక్తులు జాగరణ చేస్తారు. ఈరోజు ఉపవాసములు, వ్రతములు మొదలైనవి చేస్తారు. ఉపవాసము అనగా సమీపమున ఉండుట అని అర్థము. భగవంతుని సమీపమున ఉండుటయే సత్యమైన అర్థము ఇపుడు పరమాత్మతో కూడి ఉండుటకు పవిత్రతయనే వ్రతము చాలా అవసరము.

**అహంకారాన్ని త్యాగం చేసి ఆత్మికత్వాన్ని ధారణ చేయండి**

# శివ శంకరులలో తారతమ్యము

చాలా మంది "శివుడు-శంకరుడు" అనే శబ్దాలు రెండూ, ఒకే దేవుని పేర్లనుకొంటారు. కాని వీరిరువురిలో చాలా భేదముంది. వీరి విగ్రహ మూర్తులు కూడా వేరు వేరుగా ఉండుట మీకు తెలిసిన విషయమే. "శివుని" మూర్తి లింగాకారములో ఉండగా "శంకరుని" మూర్తి శరీరాకారమును కలిగి ఉంటుంది. పరమపిత శివపరమాత్మ ఈ విషయంలో మాకు బోధించిన విశేషములను ఇచట పొందుపరుచుచున్నాము.

## మహాదేవ శంకరుడు

1. ఈయన బ్రహ్మ, విష్ణువుల వలె సూక్ష్మమైన శరీరము కలవాడు. ఈయనను మహాదేవుడు అనవచ్చు కానీ "పరమాత్మ" శబ్దమితనికి వర్తించదు.
2. ఈయన బ్రహ్మ, విష్ణుల వలె సూక్ష్మ లోకంలో శంకరపురిలో ఉంటారు.
3. బ్రహ్మ, విష్ణు దేవతల వలె ఈయన కూడా పరమాత్ముని సృష్టి.
4. శంకరుడు కేవలము మహావినాశన కార్యమును మాత్రమే గావిస్తారు. కాని స్థాపన, పాలనా కర్తవ్యమును నిర్వహించరు.

## పరమపిత శివ పరమాత్మ

1. పరమాత్మ జ్యోతిర్బిందు స్వరూపుడైన చైతన్య మూర్తి. ఇతనికి స్థూల సూక్ష్మ స్వరూపములు రెండూ లేవు.
2. పరమాత్మ బ్రహ్మ-విష్ణు-శంకరుల సూక్ష్మలోకాలకు పైన బ్రహ్మలోకంలో (ముక్తిధామంలో) ఉంటారు.
3. ఈయన త్రిమూర్తి, అనగా బ్రహ్మ, విష్ణు, శంకరులను కూడ సృష్టించినవాడు.
4. పరమపిత పరమాత్మ బ్రహ్మద్వారా సృష్టిస్థాపన, శంకరుని ద్వారా మహావినాశనము, విష్ణువు ద్వారా పాలన, చేయించు విశ్వకళ్యాణకారి.

"శివ జయంతి" రాత్రివేళ ఎందుకు జరుపబడుచున్నది.

వాస్తవానికి రాత్రిసమయం అజ్ఞానానికి, తమోగుణానికి, పాపాచరణకు చిహ్నం. అందువలననే ద్వాపర కలియుగాలను బ్రహ్మ రాత్రి అంటారు. కలియుగాంతమున సాధు సన్యాసులు, గురువులు, ఆచార్యులు మొదలైన వారందరూ పతితులై దుఃఖములనుభవిస్తూ అజ్ఞానంలో పడి నిద్రిస్తున్న సమయములో అతి ధర్మగ్లాని ఏర్పడుతుంది. భారతదేశం విషయ వికారములకు లోనై వేశ్య వాటికగా మారిన అతి నికృష్ట సమయములో పతిత పావనుడైన పరమపిత పరమాత్మ ఈ పుడమిపై దివ్యజన్మ తీసుకొంటారు. అందువలన ఎవరు పుట్టినా జన్మదినమంటారు. కానీ శివ పరమాత్మ అవతరించినది అజ్ఞానాంధకారములో కావున "శివరాత్రి" అంటారు. చిత్ర పటములో చూపబడిన చీకటి, నల్లరంగు అజ్ఞానానికి విషయ వికారమయమైన రాత్రికి చిహ్నము.

జ్ఞాన సూర్యుని (శివుని) అవతరణతో అజ్ఞానాంధకారం నశిస్తుంది.

ఈ విధముగా అవతరించిన జ్ఞానసూర్యుడైన శివపరమాత్మ తన జ్ఞానయోగ కిరణాలను ప్రసరింపజేసి అచిరకాలములోనే కలియుగ తమోగుణమును తొలగించి సత్యయుగ సత్వగుణమును స్థాపిస్తారు. దీనితో కామాది విషయవాసనల అజ్ఞానము పటాపంచలవుతుంది. కల్పమంతటిలో పరమాత్ముని అలౌకిక జన్మచేత కొద్ది సమయములోనే వేశ్యాలయం వంటి ప్రపంచము శివాలయమవుతుంది. నరుడు శ్రీనారాయణునిగా నారి శ్రీమహాలక్ష్మిగా పరివర్తన చెందుతారు. కావున "శివరాత్రి" వజ్రతుల్యమైనది.

**స్వయం జాగృతితో జగతి ప్రకాశిస్తుంది**

# శివ శంకరులలో తారతమ్యము




సూక్ష్మలోక నివాసి, వినాశకారి, ఆకారి దేవత - రచన




పరంధామ నివాసి, కళ్యాణకారి, నిరాకార పరమాత్మ - రచయిత



# భగవంతుడు సర్వ వ్యాపికాదు

## పరమాత్ముడు సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడు
## కానీ సర్వవ్యాపి కాదు



# భగవంతుడు సర్వవ్యాపి కాదు

మానవులు ఒకవైపున పరమాత్మను తల్లి దండ్రి పతిత పావనుడంటూనే మరోవైపు ఆయన సర్వ వ్యాపకుడనుట, రాయి, రప్ప, పాము, తేలు, పంది మొసలి, దొంగ, హంతకుడు మొదలైన అన్నిటిలో ఉన్నాడనుట ఒక మహాదోషము. మనకు పరమపిత, పరమప్రియుడైన, పరమపావనుడను కుక్కలో, పిల్లిలో అన్నిటిలో ఉన్నాడంటే ఎంత పాపమో ఎంత పొరపాటో ఆలోచించారా? మనకు ముక్తి జీవన్ముక్తి వారసత్వముగా ఇచ్చేవాడు పతితులను ఉద్ధరించి, పావనులుగా చేసి, స్వర్గ సామ్రాజ్యమును ప్రసాదించే మన పరమపిత పరమాత్ముని ఈ పదములతో పిలుచుట, పలుకుట "కృతఘ్నత" అనిపించుకొంటుందా?

పరమాత్మ "సర్వవ్యాపి" అయితే శివలింగమునకు ఎందుకు పూజ జరుగుతుంది? ఆయన సర్వత్ర ఉంటే "దివ్యజన్మ" ఎలా తీసుకుంటారు.? మానవులందరూ పరమాత్ముని దివ్యావతరణమునకై పరితపించుట ఎందుకు? శివరాత్రి ప్రత్యేకమైన పండుగగా జరుపుకొనుట ఎందుకు? పరమాత్మ సర్వవ్యాపకుడైతే భగవద్గీత ఎలా బోధించారు? గీతలో "నేను పురుషోత్తముడను, నేను సూర్య, చంద్ర, నక్షత్ర మండలములకు కూడ ఎంతో దూరాన ఉన్న పరంధామ నివాసిని, తలక్రిందులుగా ఉన్న ఈ సృష్టి అనే వృక్షానికి బీజమైన నేను పైన ఉన్నాను" అను భగవంతుని మహావాక్యము ఎలా ఋజువవుతుంది? పరమాత్మ "సర్వవ్యాపి" అనే భావం కలుగుట వలననే భక్తి, జ్ఞానయోగాదులకు విరోధం ఏర్పడినది. జ్యోతి స్వరూపుడైన పరమాత్మకు ఒక విశిష్టమైన నామరూపాదులు లేకపోతే అతనితో సంబంధము ఎలా కలిగి ఉండాలి.? విశ్వవిభునితో ప్రీతిని, స్నేహమును, భక్తిని ఎలా ప్రకటించుకోవాలి? జ్ఞానమనగా ఏవిషయమును గురించైనా దాని నామ, రూప, గుణ, ధామ, కర్మ, స్వభావ సంబంధములను, దానివలన కలుగు లాభము మొదలగు వాటిని గురించి తెలుసుకొనుట మరియు సంపూర్ణ పరిచయము కలిగి ఉండుట. "పరమాత్మ సర్వవ్యాపి" అని అంగీకరించినచో మానవుడు "మన్మనాభవ"! "మామేకం శరణం వ్రజ" మొదలైన ఈశ్వరాజ్ఞలను పాటింపజాలడు. బుద్ధిలో జ్యోతి స్వరూపుడైన పరమాత్మ శివుని స్మృతిలో ఉంచుకొని, ధారణ గావించజాలడు. యోగమునందు నిలుకడ కుదరక మనస్సు భ్రమిస్తుంది. పరమాత్మ చైతన్యరూపుడు. మన పరమపిత, తండ్రి సర్వవ్యాపకుడెలా అవుతారు.? పరమాత్మ సర్వవ్యాపి అని అంగీకరించుట వలననే స్త్రీ పురుషులందరూ యోగ భ్రష్టులై పతితులయ్యారు. అంతే కాకుండా ఆ పరమపిత నుండి వారసత్వముగా సంక్రమించు పవిత్రత, సుఖ శాంతుల నుండి వంచితులై అశాంతి దుఃఖముల పాలయ్యారు.

భక్తులు "అణువణువునా" లేక "ఘటఘటములో" పరమాత్ముడున్నాడు అని చెప్పిన వాక్యములోని శబ్దార్థమును మాత్రమే స్వీకరించుట సరికాదు. "ఘటము" లేక "హృదయము" ప్రేమ మరియు ధ్యాన స్థానమనే అర్ధమును అందరూ అంగీకరిస్తారు.

ద్వాపరయుగారంభములో ప్రజలకు ఈశ్వరుని ఎడల భక్తి, జిజ్ఞాస, శ్రద్ధ బాగుగా ఉండేవి. నాస్తికుడను వాడు మచ్చునకు కూడా లేడు. ఆ కారణముచేత భావావేశంతో భక్తులు అందరిలో దేవుడు ఉన్నాడు అని అందరూ అతనిని ప్రేమించి ధ్యానిస్తారని అందరి మనసులలో ఈశ్వరుని రూపము ఉంటుందని చెప్పారు. ఈ మాటకు స్వయముగా ఈశ్వరుడే సమస్త ప్రాణుల హృదయాలలో నివసించునని చెప్పుట ఒక పెద్ద పొరపాటే కాదు, మహదోషం కూడా అవుతుంది.

**మెల్లగా, మధురంగా, మితంగా మాట్లాడండి**

# కల్పవృక్షమునకు బీజరూపుడు పరమాత్మ శివుడు

ఈ సృష్టిని భగవంతుడు ఒక తలక్రిందులుగా ఉన్న వృక్షముతో పోల్చారు. ఎందుకంటే వృక్షము యొక్క బీజము భూమిలో నుండి పైకి పెరుగుతూ వస్తుంది. మానవ సృష్టి అనే వృక్షమునకు అవినాశి, చైతన్య బీజరూపుడైన పరమాత్మ కొమ్మలచివరగా పైన పరంధామములో (బ్రహ్మలోకములో) నివసిస్తారు. పటములో అన్నిటికంటే దిగువ కలియుగాంతము, సత్యయుగ ప్రారంభమునగు సంగమయుగము చూపబడినది. అచ్చట తెల్లని వస్త్రములు ధరించిన ప్రజాపిత బ్రహ్మ, జగదంబ సరస్వతి కొందరు బ్రాహ్మణ స్త్రీ పురుషులు సహజరాజయోగ స్థితిలో కూర్చున్నారు. ఈ చిత్రము ద్వారా మనము తెలుసుకొనే రహస్యము కలియుగాంతములో అజ్ఞానాంధకారము అలముకొనిన సమయములో సృష్టికి బీజరూపుడగు, కళ్యాణకారి, జ్ఞానసాగరుడు, పరమపితయైన శివపరమాత్ముడు పవిత్రమైన నూతన సృష్టి నిర్మాణము గావించుటకు ప్రజాపిత బ్రహ్మ తనువులో (పరకాయ ప్రవేశము) ప్రవేశిస్తారని తెలుస్తుంది. ప్రజాపిత ముఖ కమలము ద్వారా మూలాధారమైన గీతాజ్ఞానమును, సహజ రాజయోగములను గురించిన శిక్షణనిచ్చారు. దీనిని గ్రహించి ఆచరణలో పెట్టిన వారెల్లరు పవిత్రులైన బ్రాహ్మణులనబడతారు. ఈ బ్రాహ్మణులు, బ్రాహ్మణ స్త్రీలూ, సరస్వతీ మొదలైన వారిని “శివ శక్తులు” అంటారు. వీరే ప్రజాపిత బ్రహ్మ ముఖము నుండి (జ్ఞానముద్వారా) ఉద్భవించిన వారు. ఈ స్వల్ప యుగము సంగమయుగ మనబడుతుంది. దీనినే ధర్మోపక్రమ యుగమనీ **(LEAP YUGA)** పురుషోత్తమ యుగమనీ, గీతాయుగమని **(GITA EPIC)** కూడా అంటారు

సత్యయుగములో అఖండమైన, అత్యంత సుఖసంపన్నమైన లక్ష్మీ నారాయణుల రాజ్యపాలన ఉండేది. ఆ కాలములో పాలు, నేయి నదులుగా ప్రవహించేవి. సింహము, ఆవు ఒకే రేవున నీరుత్రాగేవి. భారతదేశము ఆనాడు ద్వికిరీటధారులైన వారి శోభతో తేజరిల్లుచుండేది. ఎల్లరూ ఆరోగ్యవంతులుగానూ, శాశ్వత ధనాఢ్యులుగా సదా సుఖవంతులుగానూ ఉండేవారు. కామక్రోధాధి వికారములు, హింస, అశాంతి, దుఃఖము నామ మాత్రమునకైననూ లేవు. ఆసమయములో భారతదేశము స్వర్గము, వైకుంఠము లేక సుఖధామము **(HEAV-ENLY ABODE)** అని పిలువబడేది. ఆకాలములో ప్రజలందరూ జీవన్ముక్తులు, పూజ్యులు. వారు సగటున 150 సంవత్సరముల ఆయుర్దాయము కలిగి ఉండేవారు. ఈ యుగములోని వారిని దేవతా వర్ణము వారని అంటారు. పూజ్యులైన విశ్వమహారాణి, విశ్వమహారాజు, శ్రీలక్ష్మీ నారాయణ వంశీయులు 8తరాల వరకు (1250 సంవత్సరములు) రాజ్య పాలన గావించారు.

త్రేతా యుగములో చతుర్దశ కళాసంపూర్ణులు, సంపూర్ణ నిర్వికారులగు, చంద్రవంశీయులైన శ్రీ సీత, శ్రీరామచంద్రులు రాజ్యమును పాలించారు. వారి రాజ్య పరిపాలన భారతదేశములో మహిమాన్వితమై ఉన్నది. సత్య, త్రేతాయుగములలో పరిపాలించిన “ఆది సనాతన దేవీ దేవతా ధర్మ వంశమే” ఈ సృష్టి వృక్షమునకు కాండము.మూలము కూడా. దీని నుండి కాలాంతరమున అనేక ధర్మ సంబంధమైన శాఖలు వచ్చినవి. ద్వాపరయుగములో అరిషడ్వర్గాది వికారములు ప్రవేశించినవి. దేవతా స్వభావానికి బదులుగా రాక్షస ప్రవృత్తి నెలకొని సృష్టిలో దుఃఖము - అశాంతి రాజ్యము చేయసాగినవి. అశాంతిపాలైన మానవులు భక్తి ఉపాసనలు మొదలుపెట్టారు. ఋషులు శాస్త్రాలు వ్రాయనారంభించారు. యజ్ఞాలు, జపతపాదులు మొదలయ్యాయి.

కలియుగంలో ప్రజలు పరమాత్ముని మరియు దేవతలను పూజించుటయే గాక ప్రకృతిని పంచభూతములకు కూడ పూజ చేస్తున్నారు. దేహాభిమానులై పతితులగుటచే వారి ఆహార విహారములు, దృష్టి - వృత్తి, మనోవాక్కర్మలన్నియు తమోప్రధానమై విషయ వికారాధీనములైనవి.

కలియుగాంతమున మానవులు పూర్తిగా పతితులయినారు. కావున సుఖమయమైన సత్యత్రేతా యుగములను స్వర్గమనీ, దుఃఖమయమైన ద్వాపర కలియుగములను నరకమని అంటాము.

అంతర్ముఖీ సదాసుఖీ

# కల్పవృక్షమునకు బీజరూపుడు పరమాత్మ శివుడు




కళ్యాణకారి పురుషోత్తమ సంగమయుగము
పరమపిత శివ పరమాత్మ
గీతా జ్ఞానదాత
ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయము
(అబూ పర్వతము)
నరకము
స్వర్గము
సంగమయుగ సత్యబ్రాహ్మణులు
ప్రజాపిత బ్రహ్మ
సరస్వతి
జ్ఞాన, యోగములను అగ్ని
అవినాశి రుద్ర గీతా జ్ఞాన యజ్ఞం స్థాపన : 1937

# కళ్యాణకారి పురుషోత్తమ సంగమయుగము

భారతదేశములోని ఆది సనాతన దేవీదేవతా ధర్మమునకు చెందిన వారు అన్ని పండుగలు శ్రద్ధాభక్తులతో జరుపుకున్నట్లు "పురుషోత్తమ" మాసమును కూడ పాటిస్తారు. ఈ మాసములో ప్రజలు తీర్థయాత్రలు, దానధర్మములు, ఆధ్యాత్మిక జ్ఞానచర్చలు చేయుటయే కాక అమృతవేళ గంగాస్నానము చేయుట పుణ్యప్రదమని భావిస్తారు.

నిజానికి "పురుషోత్తమ" శబ్దము పరమాత్మకు వర్తిస్తుంది. "ఆత్మ"ను పురుషుడంటారు. అలాగే "పరమాత్మ పరమపురుషుడు" లేక పురుషోత్తముడని పిలువబడతారు. మానవాత్మల కంటే జ్ఞానము, శాంతి, పవిత్రాది శక్తులలో సర్వశ్రేష్ఠుడగుటచే పరమాత్మ పురుషోత్తముడు. పురుషోత్తమ మాసము కలియుగాంతమును, సత్యయుగారంభమును తెలిపే సంగమయుగానికి చిహ్నము. ఈ యుగములోనే పురుషోత్తముడవతరిస్తారు. సత్యయుగము మొదలుకొని కలియుగాంతము వరకు మానవులు జనన మరణ చక్రంలో తిరుగుతూనే ఉంటారు. కానీ కలియుగము చివర సత్యయుగపు సద్ధర్మ పునఃస్థాపనకు పురుషోత్తముడు అవతరించవలసిన అవసరం ఏర్పడుతుంది. ఈ సంగమయుగములో పరమపిత శివ పరమాత్మ జీవాత్మలకు సత్యజ్ఞానము, సహజ రాజయోగము భోదించి పరంధామమునకు తోడు తీసుకువెళతారు. మిగతా జీవాత్మలకు మహావినాశనం ద్వారా శరీర విముక్తిని కలిగించి ముక్తిధామమునకు తీసుకువెళతారు. ఈ ప్రకారముగా మానవాత్మలన్నియు శివపురి మరియు విష్ణుపురికి యాత్రలు చేస్తూనే ఉంటాయి. జ్ఞాన గంగలో స్నానము చేసినట్లయితే పావనులవుతారు. కానీ ఈ రహస్యమును తెలుసుకొనలేక పోవుటచే ప్రజలు గంగాస్నానములు, విగ్రహారాధనలు తీర్థయాత్రలు చేస్తున్నారు. వాస్తవానికి పురుషోత్తమ మాసములో చేయవలసిన మహాదానము విషయ వికారములను వదలిపెట్టుటయే. పరమపిత పరమాత్మ పురుషోత్తమ యుగములో అవతరించి విషయ వికారములను త్యజించుటకు దీక్షనిస్తారు. దీనిచేత కామక్రోధాది శత్రువులను జయించి సత్ప్రవర్తనులైన తదుపరి సత్యయుగము ప్రారంభమవుతుంది. ఈ విషయమును గ్రహించినట్లయితే ప్రతి నిత్యము ఆత్మ స్నానముగావించుకుని యోగం ద్వారా దేహబంధములకతీతులవుతారు. ఈ ఆధ్యాత్మిక యాత్రచేత విశ్వమంతటా సుఖశాంతి సమృద్ధమైన రామరాజ్యము (స్వర్గము) స్థాపించబడుతుంది. స్త్రీ, పురుషులు నరకమునుండి స్వర్గమునకు చేరుకొనగలరని చిత్రపటములో ప్రదర్శించబడినది.

ఈ చిత్ర పటములో సంగమయుగములో శ్వేత వస్త్రదారులైన ప్రజాపితబ్రహ్మా, జగదంబ సరస్వతి కొందరు బ్రాహ్మణులతో గూడి పరమపిత పరమాత్మ శివునితో యోగము చేయుచున్నట్లు చూపించారు. ఈ రాజయోగము వల్లనే మనో మాలిన్యము ప్రక్షాళన చేయబడుతుంది. పూర్వ జన్మల పాపములు దగ్ధమై సంస్కారములు సత్వప్రధానముగా అవుతాయి. అందువలననే చిత్రములో ఎడమవైపున నరకము నుండి బయటపడి జ్ఞానయోగాగ్నిని ప్రజ్వలింపజేసి దానిలో కామ, క్రోధ, లోభ, మోహ, అహంకారములను దహింప చేసినట్లు చూపబడినది. దీనికి ప్రతిఫలముగా నరుడు శ్రీనారాయణునిగా నారి శ్రీమహాలక్ష్మిగా దైవత్వమును పొంది వైకుంఠమున సుఖశాంతి పవిత్రతా సంపన్నమైన స్వరాజ్యాధికారులైనట్లు చూపించారు.

ప్రస్తుత సమయంలో సంగమయుగము జరుగుచున్నది. దుఃఖమయమైన ఈ కలియుగ వినాశనం జరిగి సుఖదాయకమగు సత్యయుగం వస్తుందని మీరు తెలుసుకున్నారు. కావున మనము పవిత్రులుగా యోగయుక్తులుగా తయారై దివ్యత్వమును పొందాలి.

**ఆత్మ పరమాత్మల కలయికయే సర్వశ్రేష్ఠమైన సంగమము**

# మానవుని 84 జన్మల అద్భుత జీవిత చరిత్ర

మానవాత్మ ఒక కల్పంలో మొత్తం 84 జన్మలు తీసుకుంటుంది. 84 లక్షల యోనులను మాత్రము ధరించదు. ఇచట మానవాత్మ 84 జన్మల చక్రము 84 మెట్ల రూపములో చూపబడినది. ప్రజాపిత బ్రహ్మా - జగదంబ సరస్వతి మనకు మొదటి తల్లి తండ్రి. కావున వారి 84 జన్మల సంక్షిప్త వర్ణనతో యితర మానవాత్మల జన్మల గురించి క్లుప్తంగా వస్తుంది. బ్రహ్మా, సరస్వతి సంగమయుగమున శివ పరమాత్మతో జ్ఞాన యోగాలనభ్యసించి ఆచరించుట వలన సత్యయుగారంభమున వీరే శ్రీలక్ష్మి శ్రీనారాయణుల పదవిని పొందారు.

## సత్యత్రేతాయుగములలో 21 పూజ్య దేవతా జన్మలు

ఈ చిత్రములో చూపబడినట్లు సత్యయుగపు 1250 సం॥లలో శ్రీలక్ష్మి శ్రీనారాయణులు నూటికి నూరుపాళ్ళు సుఖశాంతులతో కూడిన '8' జన్మలు తీసుకుందురు. ఇందువలననే భారత దేశంలో "8" సంఖ్య శుభప్రదమని భావిస్తారు. చాలామంది "8" మణులు గల మాలను జపిస్తారు. అష్టదేవతల పూజను కూడా చేస్తారు. పూజ్యస్థితి కలిగిన శ్రీలక్ష్మి నారాయణుల 8 జన్మలు "8" మెట్లుగా చిత్రములో చూపబడినది. తరువాత త్రేతాయుగపు 1250 సం॥లలో వారు చతుర్దశ కళాసంపూర్ణులైన శ్రీ సీత, శ్రీ రామచంద్రుల వంశములో, పూజ్యులైన రాజులుగా ఉన్నత ప్రజారూపంలో 12జన్మలు, సంగమయుగ బ్రాహ్మణ ద్విజన్మను కలిపి 21 జన్మలు తీసికుందురు. ఈ విధముగా సత్య, త్రేతాయుగముల 2500 సం॥లలో వారు సంపూర్ణ సుఖ, శాంతి, పవిత్రతా సంపదలు గల దేవతా జన్మలు తీసుకుందురు. కావుననే జ్ఞానము చేత 21 జన్మలు లేక 21 తరాలు తరించుదురు అనే లోకోక్తి ప్రసిద్ధి చెందినది.

## ద్వాపర కలియుగములలో 63 జన్మల జీవన బంధనము

సుఖ ప్రారబ్ధము ఈ విధముగా సమాప్తి అయిన తరువాత ద్వాపరయుగారంభంలో వారికి పూజారిస్థితి ప్రాప్తిస్తుంది. మొదటవారు వజ్రముతో గూడిన నిరాకారుడగు శివ పరమాత్మ ప్రతిమను తయారుచేసి అనన్య భక్తి చేసారు. ఇక్కడ చిత్రపటములో ఒక పూజారి రాజు రూపములో శివపూజ చేయుచున్నట్లు చూపించారు. క్రమముగా కొంతకాలానికి వీరు సూక్ష్మ దేవతలైన విష్ణు, శంకరుల పూజ ప్రారంభిస్తారు. తరువాత ఆత్మ విస్మృతి కలిగినందున తమ పూర్వ రూపములైన శ్రీ లక్ష్మి, శ్రీ నారాయణుల రూపములకు కూడా పూజలారంభించారు. అందువలననే "పూజ్యులైన వారే పూజారులైరి" అను నానుడి ప్రసిద్ధి కలిగింది. శ్రీ లక్ష్మి నారాయణుల ఆత్మలు ద్వాపరయుగపు 1250 సం॥లలో పూజారి స్థితిలో విభిన్న నామ రూపములతో వైశ్యవంశములందు భక్త శిరోమణులైన రాజులుగా సంపన్న ప్రజలుగా మొత్తం 21 జన్మలను తీసుకుంటాయి.

కలియుగారంభమున సూక్ష్మ సాకార దేవతల పూజయేకాక తత్వపూజ కూడా ప్రారంభమైనది. భక్తి వ్యభిచారిగా మారిపోయింది. ఈ స్థితి సృష్టియొక్క తమోప్రధానవస్థ లేక శూద్రావస్థ. కామాది వికారములు విజృంభించాయి. కలియుగాంతమున వీరి వంశీయులు 42 జన్మలను తీసుకుంటారు.

పై చర్చచే 5000 సం॥లలో వారి ఆత్మలు పూజ్య పూజారి దశలలో మొత్తం 84 జన్మలు తీసుకుంటాయని స్పష్టమైనది. ఈ విధముగా 83 జన్మలు తీసికొనిన తదనంతరం వారి అంతిమ జన్మలో అనగా 84వ జన్మలో వానప్రస్థ స్థితి యందు పరమపిత శివపరమాత్మ ఆయన శరీరములో ప్రవేశించి వారిపేరు ప్రజాపిత బ్రహ్మా అని బ్రహ్మాముఖ వంశీయురాలగు కన్యకు "జగదంబ-సరస్వతి" అని పేరు పెట్టెను. ఈ ప్రకారముగానే ఇతర దేవతా వంశీయులు 5000 సం॥లలో ఎక్కువలో ఎక్కువ 84 జన్మలు తీసుకుంటారు. అందువలననే భారతదేశంలో జనన మరణ చక్రమును "84" చక్రమని అంటారు. అనేక మందిరాలలో 84 గంటలు కూడ వ్రేలాడ దీస్తారు. "84 గంటల దేవి" అనే పేరుతో ఆమె పూజ కూడ చేస్తుంటారు.

**పరచింతన పతనానికి మూలము, స్వచింతన స్వర్గానికి సోపానము**


మానవుని 84 జన్మల అద్భుత జీవిత చరిత్ర
సత్యయుగము
1250 సం॥లు
సూర్య వంశము
16 కళల సంపూర్ణులు
8 జన్మలు
దేవతా ధర్మము
9 లక్షల జనాభా
శ్రీ నారాయణుడు శ్రీ లక్ష్మి
ఆత్మ
పరమపిత శివ పరమాత్మ
పరంధామము
త్రేతాయుగము
1250 సం॥లు
14 కళల సంపూర్ణులు
12 జన్మలు
పావన శ్రేష్ఠాచారీ పూజ్య భారతదేశము
స్వర్గం
శ్రీ రాముడు శ్రీ సీత
చంద్రవంశము
క్షత్రియ ధర్మము
స్వర్ణిమ భారతదేశము
ద్వాపర యుగము
1250 సం॥లు
8 కళలు
21 జన్మలు
వైశ్య వర్ణము
కలియుగము
1250 సం॥లు
2 కళలు
42 జన్మలు
శూద్ర వర్ణము

# మానవాత్మ "84" లక్షల యోనులను ధరించదు



# మానవాత్మ 84 లక్షల యోనులను ధరించదు

పరమ ప్రియుడైన శివపరమాత్మ ప్రస్తుతము ఈశ్వరీయ జ్ఞానానికి సంబంధించిన అనేక మధుర రహస్యములను విశదీకరించి చెప్పినట్లే మరొక కొత్త సత్యమును గురించి బోధించారు. అది "మానవాత్మ పశు పక్ష్యాది యోనులలో జన్మించదు" అనునది. ఇది నిజంగా చాలా సంతోషకరమైన వార్తయే కానీ, చాలామంది మానవాత్మ పశుపక్ష్యాది 84 లక్షల యోనులలో జన్మిస్తుందని" అంటారు.

ఒక దేశపు ప్రభుత్వము దోషులను శిక్షించేందుకు వారికి స్వేచ్ఛ లేకుండా ఒక గదిలో కొంత కాలము బంధించి సుఖము లేకుండా చేసినట్లు, మానవుల పాపాలకు శిక్షగా పశు పక్ష్యాది యోనులందు జన్మించి దుఃఖమును, పరాధీనతను అనుభవించ వలసి వస్తుందని వారి వాదనలోని సారాంశము.

కానీ మానవాత్మలు తమ పాపాలకు శిక్ష మానవజన్మ తీసికొనే అనుభవించునని ఇపుడు పరమాత్ముడు సుస్పష్టము చేయుచున్నారు. మానవుడు తన దుర్గుణాది దుష్కర్మల వలన పశువుల కంటే అధమాధముడై అధిక దుఃఖమనుభవిస్తాడు. కాని పశుపక్ష్యాది యోనులందు మాత్రము జన్మించడు. మానవులు తమ పాపములకు ప్రతి ఫలముగా మూగ, గుడ్డి, చెవిటి, కుంటి, కుష్ఠు మొదలైన మహా శిక్షలను అనుభవించుట మనం చూస్తున్నాము. కొన్ని జంతువులు మనుష్యుల కంటే కూడ చాలా స్వేచ్ఛగా సుఖమనుభవించుట కూడా మనము చూస్తున్నాము. కొన్ని మేలిమి జాతి కుక్కలకు రొట్టె, వెన్న అతిగారాబముతో తినిపించుట సోఫాలపై పడుకొని, తిరుగుతూ ఎంతో ప్రేమగా పోషింపబడుచుండుట మనందరికీ తెలిసిన విషయమే. కానీ ఎందరో మానవులు ప్రపంచములో ఆకలితో అర్ధనగ్నంగా, డబ్బు కొఱకు భిక్షమెత్తుకుంటూ జీవితమును అతి నికృష్టముగా రోడ్లపై గడుపుట, వారినెందరో చీదరించుకొనుట, చలికి గడ్డకట్టుకొనిపోయి రోగాలపాలై రోడ్లమీద కుక్కలకన్నా నీచంగా చనిపోవుట, మరి కొందరు భరింపరాని ఆవేదనలతో ఆత్మహత్యను చేసుకొనుట, ఇవన్నీ మనం నిత్యం చూస్తున్న హృదయ విదారక దృశ్యములు. వీటి వలన మానవునిగా జన్మించి మానవ జాతి మధ్యనే ఇంతటి ఘోరమైన శిక్షలను అనుభవించుచుండగా ఇతర పశు పక్ష్యాది యోనులలో జన్మించవలసిన అవసరము లేదని తెలియుచున్నది కదా!

## "విత్తనమును బట్టి చెట్టు"

ఇంతే కాకుండా ప్రతి మానవాత్మలోను జన్మ జన్మాంతర సంస్కారము అనాదిగా అవ్యక్తరూపములో అంతర్గతమై ఉంటుంది. ఇందువలననే మనుష్యాత్మలు తమ తమ విభిన్న సంస్కార, గుణకర్మ, స్వభావ ప్రారబ్ధము ననుసరించి సృష్టి నాటకమున తమ పాత్రను అభినయిస్తాయి. మన గుణ కర్మ స్వభావములు పశు పక్ష్యాదుల గుణ కర్మ స్వభావముల కంటే భిన్నములైనవి, మామిడి టెంక నుండి మిరపచెట్టు మొలవనట్లు, మానవాత్మ మానవ జన్మనే తీసుకుంటుంది, గానీ 84 లక్షల పశుపక్ష్యాది యోనులలో జన్మించదు. కల్పమంతటిలో (4 యుగములలో) మానవాత్మ మానవ యోనియందే మొత్తం 84 జన్మలనెత్తి తన కర్మానుసారముగా సుఖ దుఃఖముల ననుభవిస్తుంది.

## మానవాత్మ పశుపక్షులలో జన్మించిన మానవుల సంఖ్య ఇంతగా వృద్ధి పొందేది కాదు

ఒకవేళ మానవాత్మ తన పాపకర్మల కారణంగా జంతు జాలములలో జన్మలు తీసికొన్నట్లయితే ప్రతి సంవత్సరము మానవుల సంఖ్య పెరుగుతూ ఉండక తరుగుతూ ఉండాలి. ఎందుకంటే ఈనాడు విషయ వికారమయమైన కర్మలచే అందరూ పాపాత్ములే. పుణ్యాత్ముల సంఖ్య వ్రేళ్ళ మీద లెక్క పెట్టవచ్చు. వీరంతా తమ పాపాలకు ఫలితముగా పశుపక్ష్యాది యోనులలో జన్మించగా మానవుల సంఖ్య తగ్గి జీవ జంతువుల సంఖ్య పెరిగి ఉండాలి. కానీ ఈనాడు జనాభా సంఖ్య విపరీతముగా పెరుగుచుండుటను బట్టి మానవుడు పిపీలికాది పశుపక్ష్యాది యోనులలో జన్మించడని తెలియుచున్నది.

**శరీరమనే శవం చూడకు, పరమాత్మ శివుని చూడు**

# ప్రజాపిత బ్రహ్మాకుమారీ ఈ...



పాండవభవన ముఖద్వారము



తపస్య ధామము



జ్ఞాన సరోవరము



ఓం మ్యూజియమ్



## పితాశ్రీ ప్రజాపిత బ్రహ్మా

పరమాత్మ ప్రవేశించిన భాగ్యశాలి తనువు కలకత్తాలోని ఒక ప్రఖ్యాతి గల వర్తకునిది. ఆయన శ్రీమన్నారాయణుని అనన్యభక్తుడు. అతనిలో ఔదార్యము, సర్వకళ్యాణ భావన, వ్యవహార కుశలత, రాజకులోచిత గాంభీర్యాది సద్గుణములతో బాటు పరమాత్ముని కొఱకు అంతులేని పరితపన కూడా ఉండేది.

మహారాజులు, సామంతులు మొదలైన ప్రసిద్ధ పురుషులతోనేగాక నిమ్న జాతి వారితో కూడా వీరికి పూర్తి పరిచయము ఉండేది. వీరి లౌకిక అనుభవము అమోఘమైనది. వీరిలోనిభక్తి, వైరాగ్యము పూర్తి పరాకాష్ఠ దశను చేరింది. పరమాత్మ ప్రవేశించుటకు ప్రవృత్తిని దివ్యముగా మలచుటకు గృహస్థమార్గములో ఉన్న విశేషమైన వ్యక్తియే తగినవాడు. కావున ఇంకెన్నో కారణములచే త్రికాలదర్శి పరమపిత పరమాత్మ వీరి శరీరములో దివ్య(పరకాయ)ప్రవేశము గావించారు.



ప్రకాశమణి దాదిగారు
పూర్వ నిర్వాహకులు



ఓంశాంతి...



గ్లోబల్ హాస్పిటల్ అ...



రాజయోగ...

# ్వరీయ విశ్వవిద్యాలయము

## - దృశ్య మాలిక



భవనము



జగదంబ సరస్వతి

పితాశ్రీ ముఖ కమలము ద్వారా జ్ఞాన, యోగముల శిక్షణ పొందిన బ్రహ్మాకుమారీ, కుమారులలో శ్రేష్ఠురాలైన వీరి అలౌకిక జీవిత నామమే జగదంబ సరస్వతి. వీరే యజ్ఞమాత. జ్ఞానవీణాలాపనచే పరమాత్మ పరిచయమును ప్రతి వారికి ప్రసాదిస్తూ ఎల్లరిలో ఆధ్యాత్మిక జాగృతిని కలిగించినారు. జీవిత పర్యంతము బ్రహ్మచర్య వ్రతముననుష్ఠించిన పావని. సహజ రాజయోగము ద్వారా ఎందరిలోనో జ్ఞాన జ్యోతిని వెలిగించిన కరుణామయి. ప్రజాపిత బ్రహ్మా, జగదంబ సరస్వతి వీరిరువురూ పవిత్రమైన దేవతా జీవితమునకు ఆదర్శప్రాయులై నిలిచారు.



శాంతి స్థూపము



ండ్ రిసెర్చి సెంటర్



డైమండ్ హాల్



న్యూ డైమండ్ హౌస్



ానుభూతి



జానకి దాదిగారు

ముఖ్య నిర్వాహకులు



పీస్ పార్కు

# సృష్టి నాటక కర్త మరియు దర్శకుడెవరు?

ఈ మానవ సృష్టి, ప్రకృతి-పురుషుల అనాది క్రీడ. ఈ గాథ తెలుసుకుంటే మానవునకు అపరిమితానందము కలుగుతుంది.

## సృష్టి నాటకంలోని నాలుగు అంకములు

ఎదురుగా ఉన్న చిత్రములో చూపబడినట్లు స్వస్తిక్ చిహ్నము సృష్టి చక్రమును నాలుగు భాగములుగా విభజించుచున్నది.

**1. సత్యయుగము 2. త్రేతాయుగము 3. ద్వాపర యుగము 4. కలియుగము.**

సృష్టి నాటక రంగస్థలమునకు ప్రతి జీవాత్మ ఒక నిర్ణీత సమయములో పరంధామము నుండి దిగి వస్తుంది. మొదట కృతయుగ, త్రేతాయుగముల సుందర దృశ్యములు కనిపిస్తాయి. ఈ రెండు యుగములలో సంపూర్ణ సుఖప్రదమైన సృష్టిలో ప్రకృతి రంగస్థలములో "ఆది సనాతన దేవీ దేవతా ధర్మ వంశము"నకు సంబంధించిన మానవాత్మల పాత్రాభినయం ఉంటుంది. ఆ సమయములో మిగిలిన ధర్మ వంశములకు చెందిన ఆత్మలు పరంధామములో ఉంటాయి. ఈ రెండు యుగాలలోను ఈ దేవతా ధర్మమునకు సంబంధించిన ఆత్మలు తమ తమ పవిత్రతానుగుణ్యముగా జన్మిస్తాయి. అందువలననే అద్వైతులు, నిర్వైరులుగను ఉంటారు.

ద్వాపర యుగములో ఈ ధర్మమే రజోగుణావస్థను పొందుటచే ఇబ్రహీం ద్వారా ఇస్లాం ధర్మము, బుద్ధుని ద్వారా బౌద్ధ ధర్మము, క్రీస్తు ద్వారా క్రైస్తవ ధర్మము స్థాపించబడతాయి. ఈ నాలుగు ముఖ్య ధర్మపితలే ప్రపంచ నాటకమునకు ముఖ్యనటులు. వీరి ధర్మ గ్రంథములే ముఖ్య శాస్త్రములు. వీరేకాక సన్యాస ధర్మ స్థాపకుడైన శంకరాచార్యులు, ముసల్మాను ధర్మ స్థాపకుడైన మహమ్మదు, సిక్కుమత స్థాపకుడైన నానక్ వీరు కూడా విశ్వ నాటకమున ముఖ్య నటులే. అయినను మొదట పేర్కొన్న నాలుగు ధర్మములే విశ్వ నాటకమునకు ఆధారం. ఈ అనేక మత మతాంతరముల వలన ద్వాపర కలియుగములందు ద్వైత భావము, అంతః కలహములు, దుః ఖములు విజృంభిస్తాయి. కలియుగాంతమున ధర్మము పూర్తిగా నశించినపుడు అనగా విశ్వమునందు మొట్ట మొదటిదైన దేవీ దేవతా ధర్మము చాలా క్షీణించి మానవులు అత్యంత పతితులైనపుడు ఈ సృష్టి నాటక కర్త మరియు దర్శకుడైన పరమపిత శివపరమాత్మ ప్రజాపిత బ్రహ్మా శరీరమునందు స్వయముగా ప్రవేశించి అతని ద్వారా ముఖవంశీయురాలైన బ్రహ్మాకుమారీ సరస్వతి, ఇతర బ్రాహ్మణీ బ్రాహ్మణులను రచిస్తారు. వీరి ద్వారా మరల అందరికి అలౌకికులైన మాతా పిత రూపములో జ్ఞానోపదేశము చేసి ముక్తి జీవన్ముక్తిని ప్రసాదిస్తారు. అందువలన ప్రజాపిత బ్రహ్మా, జగదంబ సరస్వతి (వీరినే ఏడం- ఈవ్, ఆదం హవ్వ అంటారు) ఈ సృష్టి నాటకములో నాయికా నాయకులు. వీరి ద్వారానే పరమాత్మ పుడమిపై స్వర్గ స్థాపన గావిస్తారు. కలియుగాంతము, సత్యయుగారంభములకు మధ్య ఈ చిన్న సంగమము చాలా మహత్వపూర్ణమైనది.

## "ప్రపంచ చరిత్ర భూగోళముల పునరావృత్తి"

పటములో చూపబడినట్లు కలియుగాంతమున పరమాత్మ శివుడు మహాదేవుడైన శంకరుని ద్వారా పాత సృష్టి యొక్క మహా వినాశనము చేయించినపుడు సర్వాత్మలు తమ ప్రియమైన ధామమును (ముక్తి ధామము) చేరుకుంటాయి. తిరిగి సత్యయుగారంభము నుండి ఆది సనాతన దేవీ దేవతా ధర్మ వంశమునకు చెందిన ముఖ్యమైన మానవాత్మలు ఈ సృష్టి రంగస్థలమునకు రావడం ప్రారంభమవుతుంది. మరల 2500 సం॥ల తరువాత ద్వాపర యుగారంభమున ఇబ్రహీం యొక్క ఇస్లాం మతమునకు చెందిన ఆత్మలు తరువాత బౌద్ధ ధర్మమునననుసరించు ఆత్మలు, క్రైస్తవ మతానికి చెందిన ఆత్మలు తమ తమ సమయము రాగానే సృష్టి రంగస్థలమునకు వచ్చి తమ తమ పూర్వ నిశ్చితమైన అనాది పాత్రలను అభినయిస్తూ తమ స్వర్ణ, రజత, తామ్ర, లోహ దశలను అనుభవిస్తాయి. ఈ ప్రకారముగా అనాదిగా నిశ్చితమైన సృష్టినాటకము అనాది కాలము నుండి 5000 సం॥ల కొకసారి ఉన్నది ఉన్నట్లుగా పునరావృత్తి అవుతూనే ఉంటుంది.

**ఈ క్షణమే మనది మరుక్షణము మరెవరిదో**

# సృష్టి చక్రము

## సృష్టి నాటక కర్త మరియు దర్శకుడెవరు?



# ఇపుడు కలియుగము ప్రథమ పాదంలో లేదు, అంతిమ దశలో ఉన్నది



# ఇపుడు కలియుగము ప్రథమ పాదంలో లేదు, అంతిమ దశలో ఉన్నది

ఈ కలియుగము అతి త్వరలో మహా వినాశనమై కృతయుగము రానున్నది. కానీ చాలామంది కలియుగము పూర్తికావటానికి ఇంకా కొన్ని లక్షల సంవత్సరములు పడుతుందని, శాస్త్రాలనుసారం సృష్టి మహా వినాశనమగుటకు చాలాకాలం పడుతుందని అంటారు. ఇపుడు కలియుగమింకా బాల్య దశలోనే ఉన్నదని వారి భావన.

కాని పరమాత్మ "ఇపుడు కలియుగము వృద్ధాప్యము నందున్నది, సృష్టి మహా వినాశన ఘడియ సమీపించినది" అని తెలియపరుస్తున్నారు. కామ, క్రోధ, లోభ, మోహ, అహంకారములనే చితిలో మానవులు తగలబడి పోవుచున్నారు. ఇక మహా వినాశనము కొఱకు ఆటంబాంబులు, హైడ్రోజన్ బాంబులు, మిజైల్స్ సిద్ధంగా ఉన్నవి. అయినప్పటికీ మహావినాశనము చాలా దూరములో ఉన్నదని భావించిన వారు ఘోర అజ్ఞానముతో కుంభకర్ణుని నిద్రలో మునిగియున్నట్లే. ఆ భావన కలిగిన వారు తమ అకళ్యాణమును తామే కోరుకున్నట్లవుతుంది. అటువంటి వివేక హీనులు పరమపిత పరమాత్మ అవతరించి జ్ఞానామృతమును పంచుచుండగా దానిని గ్రహింపజాలక వంచింపబడతారు.

శాస్త్రవేత్తలు మాత్రము జనసంఖ్య పెరిగినంత శీఘ్రముగా ఆహారోత్పత్తి మాత్రము పెరుగుట లేదని, అందువలన దీని పరిణామ స్వరూపంగా మహా వినాశన మగునని ఘోషించుచున్నారు. కొన్నాళ్ళకు వాతావరణము కలుషితమై పెట్రోలు, బొగ్గు, మొదలగు ఇంధనములు ఏ మాత్రమైనా లభించవని, భూగోళ శాస్త్రజ్ఞులు భూమి పూర్తిగా చల్లబడి హిమపాత (మంచుమయం) మగునని చెప్పుచున్నారు. ఈనాడు కేవలం ఒక్క రష్యా, అమెరికాలలోనే 12 లక్షల మెగాటన్నుల ఆటంబాంబులు తయారైయున్నవి. ఇంతేకాకుండా ఈనాడు నీచము, దుర్భరమగు విషయ వికారమయ జీవితము గడుపుచూ యింకా కలియుగము కోట్లసంవత్సరాలు ఉండునని తలచుట కనులుండి గ్రుడ్డివానితో సమానమానవచ్చు. కావున పరమపిత పరమాత్మ, అధర్మ వినాశనమునకు ముందే దేవతాధర్మ పునఃస్థాపన గావించునను ముఖ్యవిషయము మరచిపోరాదు.

ఇపుడు పరమాత్మ శివుని పావనమైన సత్యయుగ దేవతాసృష్టి పునఃస్థాపన ప్రారంభమైనది. కరుణా సాగరుడగు పరమపిత మానవుని దేవతగా, అపవిత్రుని పవిత్రునిగా మార్చుచున్నారు. ఇపుడు వారి ద్వారా సహజ రాజయోగము, జ్ఞానము అను అమూల్య విద్యలను నేర్చుకుని జీవితమును పావనముగను, సత్వప్రధానముగను, ఆనందమయముగను చేసుకును తీవ్రపురుషార్థము గావించాలి. కలియుగమింకా లక్షల సంవత్సరాలుండునని నిర్లిప్తముగా ఉండుట "సిరి వస్తే మోకాలడ్డు పెట్టుట" వంటిది. కలియుగ మిప్పుడు మృత్యుశయ్యపై ఉండుటయే కాదు అంతిమ శ్వాసలో ఉన్నది. ఈ సృష్టి కామ క్రోధాది విషయ వికారములనే రోగములతో కుళ్ళి క్రుశించి నశించుచున్నది. ఇంకా ఈ సృష్టికి కోట్లకొలది ఆయుర్దాయము కలదనుకొనుట తప్పు. కలియుగమిప్పుడు ప్రథమ పాదంలోనే ఉన్నదనుకొని అజ్ఞాన నిద్రలో మునిగివున్న ప్రజలే కుంభకర్ణులు. ఈశ్వరీయ సందేశమును ఒక చెవితో విని మరొక చెవితో వదిలివేయు వారి చెవులు కుంభము (కుండ)తో సమానము. ఎందుకంటే కుండలో ఏదైనా వాక్యము చెప్పిన అది తిరిగి బయట ధ్వనితో లీనమై పోయినట్లు వీరు కూడా విని విననట్లుంటారు.

**యోగాగ్నితో క్రోధాగ్నిని చల్లార్చండి. ఇప్పుడు లేకున్న మరెప్పుడు లేదు**

# రావణుడు ఎవరు? రావణునికి పది తలలు ఉన్నాయా?

భారతదేశంలో ప్రతి సంవత్సరము రావణాసురుని బొమ్మను తగలబెడతారు. పది తలలు గల రావణుడనే పేరుగల రాజు ఒకడు లంకా నగరమును పాలించాడని, అతడే సీతను అపహరించాడని మన వారి నమ్మకము. ఇతడు మహా పండితుడనడానికి చిహ్నాముగా అతని చేతిలో శాస్త్రాలు, వేదాలు ఉన్నట్లు చూపిస్తారు. అతని మూర్ఖతకు మొండి తనమునకు చిహ్నాముగా గాడిద తలను పైన చూపుతారు. కానీ ఇపుడు పరమపిత శివ పరమాత్మ పది తలలుగల రావణుడను రాక్షసుడు లేడని రావణుడు దుస్స్వభావమునకు గుర్తు అని చెప్పుచున్నారు. రావణునిలోని పది తలలు స్త్రీ, పురుషుల లోని అయిదయిదు విషయ వికారములకు చిహ్నామని, ఎన్నో గ్రంథములు, శాస్త్రవిజ్ఞానము, ఉన్నత విద్య కలిగి ఉన్నప్పటికీ హింసకు విశృంఖలత్వమునకు, ఇంద్రియలోలత్వమునకు గురియైన సమాజమునకతడు గుర్తు. ఈ విధమైన వారి పాండిత్యం కేవలం బరువు చేటు మాత్రమే. ఇట్లాంటి వారు గర్విష్టులై ఇతరుల హితోపదేశమును కూడ వినిపించుకొనరు. రావణుడు అను శబ్దమునకు అర్ధమే ఇతరులను ఏడిపించువాడు. దుఃఖములు, దుష్కర్మలకు ఫలితము. దుష్కర్మయే మానవుని జీవితంలో దుఃఖించే విధంగా చేస్తుంది. సీతాపహరణమనగా నిజమైన అర్థము పవిత్రమైన ఆత్మల పవిత్ర భావములను అపహరించుటయే. ఇలాగే కుంభకర్ణుడు సోమరితనమునకు, మేఘనాధుడు కటువచనములకు గుర్తు. ఈ ప్రపంచమే ఒక మహా ద్వీపము. మానవుని మనస్సే ఒక లంకా నగరం.

